# చిలకా గోరింకలు

గున్నమామిడి చివరి కొమ్మలు విరగ బూశాయి; అక్కడక్కడ పిందికూడా పేలింది. ఆకుదూసిన మల్లి పందిరి చివురు కనిపించకుండా మొగ్గ దొడిగింది. మొగ్గల సందులనుంచి తొంగిచూసే లేత చివుళ్ళు కొత్త పెళ్ళికూతురు సిగ్గు చిందిన పెదవుల్లా కదులుతున్నాయి నిటారుగా పెరిగిన గులాబీ రెమ్మమీది పెద్దమొగ్గ విడవడానికి సంకోచిస్తోంది. అత్తచాటు కొత్త కోడలు భర్తను సమీపించడానికి వెనకాడుతున్నట్టు కొమ్మ పంగలలో గుంపులు కట్టాయి కాయలు.

ఉదయిస్తూనే ప్రచండంగా విజృంభించిన ఫాల్గు భానుని తీవ్రతకు తాళలేక తలలువాల్చాయి మందారాలు. చెట్లన్నీ దీనంగా ఆకులూ, రెమ్మలూ వాల్చుకున్నాయి. చెరువు గట్టుమీద రావిచెట్టు ఆకులన్నీరాలి ఎండిపోయాయి. అక్కడా అక్కడా చివురులేచి ఎర్రగా, సంధ్యా కాంతులతో పగడాలు విసిరినట్లున్నాయి. ఆగి ఆగి కావ్ కావ్ మంటోంది కాకి.

'స్తంభించింది గాలి'

అన్నాడు ప్రకాశం, వేపచెట్టు నీడన పడక కుర్చీలోంచి లేస్తూ.

"ఫాల్గుణం వెళ్ళకుండానే ఎండలు మండిపోతున్నాయి. ఇంక ఎండాకాలమూ, రోహిణీకార్తె వస్తే..." అంది, కాకరపాదుకు నీళ్ళు పోస్తున్న సుశీల.

"ఇంకొస్త చల్లబడ్డాక చూడవచ్చుగా ఆపాదులకు నీళ్ళసంగతి. నువ్వసలే సుకుమారివి" అన్నాడు, మల్లి పందిరి మీది, ముసురాకు ఏరిదూస్తూ.


"మీరుమాత్రం ఏం జేస్తున్నారూ" అని తర్జనితో, ముక్కుచివరల చెమట తుడిచి, విసిరింది.

"అంతేలే, కోడలికి బుద్ధిచెప్పే అత్తగారికి గడ్డితినడం అలవాటే" అని నవ్వాడు.

'ఉషశ్రీ'

"అన్నట్టు మరిచేపోయాను. రేపు మానాన్న వస్తున్నాడు" అంది, కింద పెట్టిన చిన్న బిందె చంకిలోకి తీసుకుంటూ "ఎందుకో..." అని నవ్వి "కన్నకూతురు ఏం అవస్థ పడుతోందో చూద్దామని కాబోలు" అని ఆమెను సమీపించాడు.

"చాల్లెండి" అంటూ, బిందె బోర్లించి, అక్కడే కూర్చుంది.



ఎదురింటివారి మామిడి కొమ్మ గుబురుల్లోంచి ఒక్కకూత విసిరింది, కోకిల.

"అలాగే కూర్చో... ఆపోజులో ఒక్క బొమ్మ లాగి పత్రికకు పంపి – నీలాటిరేవులో నీరజాక్షి, అని శీర్షిక పెడితే పాతిక

రూపాయల పారితోషికం'' అని చిరునవ్వు విసిరాడు.

''ఇంతవరకూ అక్షరాలలోనే ఎక్కి స్తున్నారు, ఇంక బొమ్మలు తరువాయి" అని విచిత్రంగా కన్నులూ, పెదవులూ మిలమిల లాడించి లేచింది,

"మరెవరి బొమ్మలయినా తీస్తే దిమ్మతిరిగేలా వాయిస్తారు" అంటూ పడక కుర్చీలో కూర్చున్నాడు.

"హమ్మయ్య ' అని నిట్టూర్చి, కుర్చీ వార మడత మంచం మీద కూర్చుంది. కిందనున్న వారపత్రికతీసి విసురు కుంటూ, భార్యవైపే చూస్తున్నాడు ప్రకాశం.

"ఆ ప్రక్కనున్న విసనకర్ర ఇలా పడేద్దురూ " అంది.

"కాస్సేపు విసరనా?" అన్నాడు.

"మీ చేతికందే దూరంలో ఉంది కదా అని అడిగాను, నేనే తెచ్చుకుంటా లెండి." అని లేవబోతూండగా, అతనే అందించాడు.

రెండుక్షణాలు విసురుకుని,

"మీ నాన్న ఎందుకు వస్తున్నట్టో." అన్నాడు, శూన్యంలోకి చూస్తూ.

''నాకు మాత్రం ఏం తెలుసు. ఆఖరు చెల్లికి ఏవో సంబంధం ఉన్నదని విన్నాను.''

"అయిదున్నరయినా యింకా టపా రాలేదేమే.''

"అయ్యో, నా మతీ, ఉత్తరాలు మూడు గంటలకే వచ్చాయి. మీ రేదో రాసుకుంటున్నారని...''

అంటూనే లేచి వెళ్ళి ఉత్తరాలు తెచ్చి యిచ్చింది.

''కవర్లు చింపనే లేదా యేవిటే!''

''ఏదో పనిలో ఉండి...అయినా మీ ఉత్తరాలు నే నెందుకు చదవాలి, చది వినా అర్ధమవుతాయి కనకనా...''

"అలా అన్నావు బావుంది. అంతే కాని, నీకు తెలీని రహస్యా లేము న్నాయి" అంటూ, కవరుచింపి చద వడం మొదలెట్టాడు

"ఏమో, కాలేజీలో చదివినవారు కదా, ఏ రహస్యాలయినా ఉండవచ్చు" అని, చిన్నానవ్వు నవ్వింది.

నవ్వినప్పు డామె బుగ్గ సొట్టపడింది, చుబుకం రెండుగా చీలింది. వెనక్కి వ్రాలి పడుకుని ఉత్తరం చదువుతున్న వాడు, అకస్మాత్తుగా ముందుకు వంగి, మరోసారి చదవడం మొదలెట్టాడు.

చెరువుగట్టుమీది జమ్మిచెట్టు గుబురు లోంచి గుడ్లగూబ అరిచింది. ఆ కూతకు అదిరిపడ్డ సుశీల - "ఛి ... ఛీ..." అనుకుంది.

"అలా అవకూడదు. వాళ్ళ తప్పు లేదు నాన్నగారు చేసిన అప్పు..." అంటూ ఉత్తరం అందించి, నిట్టూర్చాడు.

అంతవరకూ అతని ముఖంలోని ప్రసన్నత, కన్నులలో వెలుగు జారి

పోయాయి. మనస్సు వికలమై, గుండె బరువెక్కింది.

"ఏమిటిదీ, మావగా రెప్పుడూ అప్పు చేసేవాడేకాదే, పైగా అప్పుచేయ్యడ మంటే ఆయనకు కిట్టేదికాదు. ఇంట్లో ఉప్పు నిండుకుంటే, రాత్రిపూటయినా సరే, వెళ్ళి తెచ్చేవారేకాని, అప్పటికి వెళ్ళవిచ్చే వారుకాదు."

అంటూ కన్నులు ఉత్తరం మీదగానే కేంద్రీకరించింది.

"జీవితాల్ని కొందరు అలానే గంభీరంగా సాధిస్తారు. తాము చేసేపనిలో లాభ, నష్టాలూ-కష్ట-సుఖాలూ గ్రహించి ఆ కష్ట, నష్టాలు యితరులకు కనిపించకుండా మింగేస్తారు. హాలాహలం మింగిన పరమశివుల్లా..."

అని, కనులు మోడ్చి, తలకింద చేతులుంచుకుంటూ, వెనక్కువాలాడు.

"వెధవ మూడువందల కోసం దావా వేసి కోర్టు కీడుస్తున్నాడా," అని, ఉత్తరము నలిపి, నేలమీద విసిరికొట్టింది.

"ప్రాణంలేని కాగితంమీద కోపం దేనికే."

"ప్రాణం కాగితాలకే ఉంది. ప్రాణాలు తియ్యడానికీ, ఆ ప్రాణాలుపోయినా, వారి వంశాన్ని నడిపీధికి ఈడవడానికీ ఈ కాగితాలకే ఉంది శక్తి."

"పురాకృతం."

అన్నాడు, కుర్చీలోంచి, లేస్తూ.

"ఎందుకు లేచారు" అంది.

"ఎవరన్నా దాతలు."

"అయిదువందలు ధర్మంచెయ్యగల దాతల కాలం కాదిది. బలి, కర్ణుడు, శిబీ లాంటి వాళ్ళంతా పురాణాల్లోనే నిద్ర పోయారు."



"ధర్మధాతలు కాదు, ఋణదాతలు"

"ఋణదాతలు.. "అని వెర్రిగానవ్వి-

"మనకేముందని యిస్తారు. కనీసం కలవారిముందు కల్లిబొల్లి కబుర్లు చెపుతూ, చేతులు నలుపుకుంటూ నిలబడడం కూడా రాదే.

"నూటయాభై రూపాయల ఉద్యోగం అయిదువేలు ఖరీదుచేసే యిల్లు."

"ఉద్యోగికి అప్పులివ్వరు. ఇల్లయితే తణఖా పెట్టాలి" అంది.

"త...ణ...ఖా..."

అని వెనుదిరిగి కుర్చీలో కూర్చున్నాడు

సుశీల గుండెలు జివ్వున లాగాయి.

ఆమె కనుగొలుకుల్లో రెండే రెండు బాష్పబిందువులు ఇరుక్కున్నాయి.

"అప్పువద్దూ, తణఖా వద్దు" అంది చెంగుతో కన్నులు ఒత్తుకుంటూ.

"కలవారిముందు చెయ్యి జాపితే మన లేమి బయటపడి, వారి యెదుట నవ్వులపాలు కావడమే మిగులుతుంది." అని, ఒక్కగుక్క దుఃఖం మింగాడు

సుశీల శూన్యంగా చూస్తోంది.

ఎదురుగా మల్లి పందిరిమీద ఎగిరే శీతాకోకచిలుక, ఒక్కచుట్టు తిరిగి, పక్కనున్న దేవకాంచనం కొమ్మలమధ్య సాలిగూడులో యిరుక్కుని, గిలగిలలాడింది.

మరింత గిలగిలలాడే హృదయంతో సుశీల, దాన్ని విడిపించడానికి లేవబోయింది.

అప్పటికే అది రెక్కలు విదలించి, హాయిగా బైటపడి, మందారపువ్వు వైపు ఎగిరిపోయింది.

సుశీలగుండె కుదుటపడింది.

"ఎందుకొచ్చిన బరువిది నాకు."

అంటూ, మెడలోని చంద్రహారం తీసి అతని చేతిలో ఉంచింది.

ఆమె గొంతులో దుఃఖం గురగురలాడుతోంది.

ఆశ్చర్యంతో నిండిన ఆవేదనలో అతని కళ్ళనీళ్ళు, ఒడిలోవున్న చంద్రహారంమీద టపటప రాలాయి.

"పేరంటానికి వెళ్ళిన చంటి వచ్చే వేళ్ళయింది. అదింటికొస్తే మిమ్మల్ని కదలనివ్వదు, లేవండి."

అంది చంద్రహారం కళ్ళకద్దుకుంటూన్న ప్రకాశంగుండె బరువెక్కింది.

అతని పెదవులపై విషాదం నిలబడిన చిరునవ్వు సుశీలను ఆశ్వాసించింది.

—:*:—